# నమ్మకస్తుడు

ఉదయం రైలు దిగి వచ్చాడు చంద్రం. అది అత్తవారి పల్లెటూరు. అందువల్ల కూంచి డాబు, దర్పంతో ఉన్నాడు.

చంద్రం మామగారు ఊళ్లో లేరు. త్వర త్వరగా భోజనం ముగించి మధ్యాహ్నపు ఎండలో—ఊరు విడిచి, రేవు దాటి... రైలుకట్టకు అడ్డంపడి, రాతిభూముల్ని దాటుకుంటూ, సిగరెట్టుమీద సిగరెట్టు ముట్టించి, ఈలవేస్తూ, ఆకాశం వంక చూస్తూ, దూరానఉన్న దిబ్బవద్ద పొలానికి చేరుకొన్నాడు, చంద్రం. అతని చేలో ఆ రోజు కుప్పనూర్పిడి. పసుపు కుంకుమ క్రింద తన పెళ్లికి మామగారిచ్చిన చేనది.

పడుగుమీది కెక్కి ట్రాక్టరు తిరుగుతోంది. తిరగలి తిరిగినట్టు. అసిరిగాడు ఎదురై "ఎప్పుడొచ్చావు దొరో!" అంటూ ముందంగా వచ్చాడు. చిఱునవ్వు సమాధానంగా ఇచ్చి కడిమిలోకి పోగాడు, చంద్రం. ముఖంమీదికి గడ్డిదూగర పడ్తోంది. కడిమి లోపల 'రౌండ్స్' కొట్టాడు. పడుగు లాగుతూ మిఠాయి రామయ్య పరుగునవచ్చి జనము చేలో గట్టుమీద గడ్డిపరచి 'కూర్చోండ'న్నాడు, వినయంతో ప్రక్కకొదిగి. "ఉదయ మొచ్చారా!—ఈ ఎండలో పడి తమరు రావాలా ?—నే నున్నానుగా" అన్నాడు. నవ్వి ఊరుకున్నాడు, చంద్రం.

చంద్రం కూర్చుంటూ గడియారం వంక చూశాడు. ఒంటిగంటా యేభై నిముషాలయింది. ఎండ మండిపోతోంది. ట్రాక్టరు వేగంగా తిరుగుతోంది. మిఠాయి రామయ్య కూలీలను అదలిస్తున్నాడు—"పడుగు త్వరగా లాగం"డంటూ = ట్రాక్టరు వేగం తగ్గి ఒక ప్రక్కకొచ్చి ఆగింది. అసిరిగా డవతల వైపున కొంకితో గడ్డిలాగి కడిమి మీదకు విసురుతున్నాడు. ఇవతలవైపున కూర్చున్న చంద్రం "వెధవ! దొంగనాటకం వాడూనూ—నేనొచ్చానని పనిలోపూనుకున్నాడు" అనుకున్నాడు. జరిగిన వర్షఋతువులో... చేలో ఊడ్పుకు ముప్ఫయిమంది కూలీలను తీసుకు రమ్మంటే—వాడు ముప్పయి ఇద్దర్ని తీసుకు వచ్చాడు. అక్కడే తనకూ వాడికీ తగవొచ్చింది పొగరుబోతు వెధవ! ఎదురుగా వున్న ట్రాక్టరు డ్రైవరు తనను చూస్తున్నాడు!... తన ఠీవి, సంస్కారము...అందానికి తనే సిగ్గుపోయాడు. తెల్లటి లాజాల్కైన, వెలగల, పలుచని లాల్చీ ఆ ఎండలో తన అందాన్ని మరింత ప్రస్ఫుటపరుస్తోంది. మరి వాడు చూస్తున్నాడంటే — ఎందుకు చూడడూ? పల్లెటూరి మొహం! అనుకుని వెక్కిరింతగా చూశాడు. ట్రాక్టరుతోలే మనిషి ముఖం తప్పించుకున్నాడు. నవ్వుకున్నాడు, చంద్రం. పాపం! వాడికేం తెలుసు మరి? అని జాలిపడ్డాడు. వాడేకాదు, చాలామంది అలాంటివాళ్లు ఉన్నారని సమాధానపడ్డాడు.

కళ్ళంలో కట్టలుపరుస్తున్నారు. చురుగ్గా ప్రతికూలీ రొమ్మువిరిచి పనిచేస్తున్నాడు. "రైతువచ్చాడని గ్రహించుకున్నారు;" అని ఊహించిన చంద్రం విజయ గర్వంతో లేచి నుంచున్నాడు. ట్రాక్టరు ఒక్కసారి విదిలించుకుని మదపుటేనుగులా మళ్ళీ కుప్ప మీదికెక్కింది. గద్ద ఒకటి కడింమీదుగా

## దండమూడి బాలగంగాధరరావు

ఎగురుతోంది. తన నెత్తిమీద తన్నిపోతుం దేమోనని బిత్తరపోయి కూర్చున్నాడు చంద్రం. గద్ద ఆకాశంలోకి ఎగిరిపోయింది. అసిరిగాడు దానివంక నిక్కినిక్కి చూస్తున్నాడు. 'దొంగవెధవ! వాడిచూపే వేరు,' అనుకున్నాడు చంద్రం. మిఠాయిరామయ్య అలాపనిలో సతమతమౌతుంటే-వీడు ఊరికే కూర్చోటం చంద్రానికి మండుకొచ్చింది. ఐనా, వాడిమీద అధికారం చెలాయించే ధైర్యంలేదు. కాని, ఊరుకోలేకపోయాడు. "అసిరిగా! కూర్చున్నావేరా," మెత్తగా తిట్టేధోరిణిలో అన్నాడు కాని ఆ ధ్వని పేలవంగా జాలిగా వినిపించింది అతనికే. అంతలోనే అసిరిగాడు "ఎందుకీ దూగరలో కొత్తారు! దూరానపోయి కూకోక"—అని కసిరి పనిలోజొరబడ్డాడు. చివుక్కుమంది చంద్రం ప్రాణం. ఈసడింపు ధ్వని అతన్ని కుంగదీసింది. "పిడిదగ్గరున్న రోగమే యిది" అనుకున్నాడు. మనస్సులో అసిరిని తిట్టుకుంటూ, పైకిమాత్రం ఏమీ జరగనట్లు గట్టు మీదికెళ్ళి కూర్చున్నాడు.

అసిరిగాడు చంద్రం మామ రాఘవయ్య గారిపాలేరు. రాఘవయ్యగారి తండ్రికాలం నుంచీ వాడు ఉంటున్నాడు. పూర్ణవృద్ధుడైనా, వాడికింకా పిక్కబలం చావలేదు. ఆపొలంమీదే పడిఉంటున్నాడు. అతినిక్కచ్చి, గడుసుస్వభావంకల మనిషి వాడు. ఎదుటమనిషి అపార్థంచేసుకునే వాలకం అసిరిగాడిది. కాని చెడ్డవాడుకాదు. చంద్రానికి అసిరిగాడంటే అనుమానము, భయమూను. తలబిరుసుగా అగుపిస్తాడు అసిరి. అందుకు చంద్రానికి వళ్లుమంట. కనుకనే, మిఠాయి రామయ్య అనే ఆవూరి కాపుని తనపొలంమీద నిగామానుగా మామగారితో చెప్పి మరీ వేయించుకున్నాడు.

ట్రాక్టరు దిగివెళ్ళిపోయింది. పడుగులాగి, వడ్లకళ్లం ఒకదరికి చేరుస్తున్నాడు. నాలుగు గంటలు కావచ్చింది. తూరుపుగాలి విసురుతోంది. కొందరు పోతపోస్తున్నారు. కొందరు కళ్లం తుడుస్తున్నారు. చీకటిపడక ముందే పనిపూరిచేయాలని అసిరిగాడు తొందరచేస్తున్నాడు.

ఇంటివద్దనుంచి చంద్రానికి ఫ్లాస్కులో టీ, ఫలహారం వచ్చింది. దూగరపడుతోందని దూరంగా జొదగట్టుపై గడ్డివరచాడు మిఠాయి రామయ్య. వాడి సేవకు ముగ్ధుడై గడ్డిమీద కూర్చుంటూ చంద్రం, మిఠాయి రామయ్యను కూడా కూర్చోమన్నాడు. తాను కొంత తిని, మిగిలినది కాపువైపు త్రోశాడు.

పగపడి పోత అయింది. 'టీ' మిగిలింది గుటక వేస్తూ "తమ రిప్పుడు రాజమండ్రిలో నేనా ఉండటం?"అని అడిగాడు రామయ్య. "అవును" అన్నట్లు పకిలించాడు, చంద్రం. దూరాన అసిరిగాడు తనవంకే చూస్తుంటే, మనస్సులో చంద్రం తిట్టుకున్నాడు. "అక్కడ తమకు బోలెడు వ్యాపారమటగా!" "కాదుమరీ! అక్కడ పెట్రోలు షెల్సన్నీ దరిదాపూ మావేగా" "చిత్తం చిత్తం" అంటూ "తమరు రెంపురోజు లుంటారా?" అన్నాడు మిఠాయి రామయ్య. "అబ్బె! నాకక్కడోయ్ తీరుబడి. మామగారు ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తుంటే రాక తప్పింది కాదు. ఒక్కనాడు నేనక్కడలేకపోతే అన్నిపనులూఆగిపోతవి" అన్నాడు చంద్రం.

మొత్తంమీద అసిరిగాడు పోత అయిం

వనిపించాడు. మిఠాయి రామయ్య రైతువద్ద నుంచి లేచి రాసివద్దకు వెళ్ళాడు. కూలీలు వెళ్ళిపోయే తొందరలో త్వర్మ నిలుచుకు పనిచేస్తున్నారు. వాళ్ళకు "అబొద్దు కొత్త అవతలకు జరపండి"—"ఇదుగో! రాసిమీద మరింత గడ్డి వేయండి" అంటూ రామయ్య పురమాయిస్తున్నాడు.

పశ్చిమాకాశాన సూర్యబింబం పెద్దదై—ఎఱ్ఱనై కుంకుమరంగుతో సముద్రగర్భంలో అదృశ్యమయింది. చంద్రానికి ఇంటివద్ద నుండి కబురు వచ్చింది. చీకటి రాకముందే ఇంటికి విచ్చేయమని. అది అర్ధాంగి పంపిన సీటికబురు! 'అమాయకురాలు' అని నవ్వుకున్నాడు చంద్రం. "వెళ్ళండి బాబూ!" అంటూ మిఠాయిరామయ్య ప్రోత్సాహ పడ్డాడు" "రాత్రికి మరెవరో ఇక్కడ?" ప్రశ్నించాడు అసిరిగాడు చంకన కఱ్ఱబెట్టి, బొడ్లో నుంచి పుగాకుతీస్తూ. వాడికిదంతా మంట. వాడి హయాములో రైతు ఎప్పుడూ పొలాని కొచ్చిన రోజు జ్ఞాపకంలేదు. "ఎవరేమిటి, నేనులేనూ?...నీవు రావూ? త్రాగి పడుకుందామనుకుంటున్నావా?" అన్నాడు తొందరతొందరగా మిఠాయిరామయ్య. అది వినిపించుకోకుండా అసిరి కూనిరాగం తీస్తున్నాడు. చంద్రం ఆశ్చర్యంతో "త్రాగుతాడేమిటి వీడు?" అన్నాడు. "సరిగ్గా ముంతవుండాలి-గాడిదకొడుక్కి" అంటూ మిఠాయిరామయ్య నవ్వాడు. అసిరిగాడు రుస రుసచూస్తూ "ఊరుకోవయ్యా నీకబుర్లకేటిగాని" అంటూ చంద్రంవంక చూసి 'తమరు పదండి దొరా! నేనుంటా నిక్కడ" అన్నాడు. "ఏడ్చావులే" అనుకున్నాడు స్వగతంగా చంద్రం.

చంద్రానికి సమస్య అయింది. ఆనలే అనుమానపు మనిషి. రాత్రిగడిస్తే మళ్ళీ సంవత్సరంవరకూ ఏ బాధా ఉండదు. 'ఓపికపడ్డాం' అనుకున్నాడు. మిఠాయి రామయ్యతో "నువ్వెళ్ళి అన్నం తీసుకురా నేముంటాం ఇక్కడ" అన్నాడు. "కొంచం ప్రొద్దుపోతుంది మరి. తెల్లవారు ఝామునకు బళ్ళవాళ్ళను రమ్మన్నాద్దూ" అన్నాడు రామయ్య. "అలాగేలే" అన్నాడు చంద్రం. "కోడికూసేతలికే బళ్లు వచ్చేమాదిరి చూడవయ్యా రామయ్యో" అన్నాడు అసిరిగాడు. మిఠాయి రామయ్య ముందుకు పోగాడు.

కూలీ లప్పుడే, రైలు కట్టదాటి రేవులో బల్లకట్టుకోసం నుంచున్నారు. మిఠాయి రామయ్య కఱ్ఱ చేలకు పోగినూ శీఘ్రంగా దిబ్బదాటి చింతచెట్టు గుబుర్లో బీడీ ముట్టించాడు. సంధ్యపోయి చీకటి విచ్చేసింది. చలిగాలి రివ్వుమంటూ చెవుల్లో దూరుతోంది. అసిరిగాడు కడింమీద సంచి పరచి రైతుని కూర్చోమన్నాడు. తనూ, ఎడంగా కడిమిలో


# ఇప్పుడు మెక్లీన్సు

## యింతకు ముందుకంటె పళ్లను తెల్లగా శుభ్రపరుచును

గొప్పవార్త! మీ పళ్లు ఇంతకుముపు వన్న శుభ్రముగాను, తెల్లగాను చేయుటకు మెక్లీన్సులో క్రొత్త పదార్థము చేర్చబడినది. అంతే ఇంకా ఆరోగ్యవంతముగ కూడ చేయుచున్నది. మెక్లీన్సువాడి మీ పళ్లు ఎంత తెల్లబడ్డవో చూడుకొనుడు.



## మెక్లీన్సుతో తెలుపుచేయబడిన పళ్లు

### చాలా ఆరోగ్యవంతమైనవి - దంతక్షయము నుండి సురక్షితము

మీపళ్లను మెక్లీన్సుతో తోముకొండి- మొదట తెల్లగాను, ఆనందదాయకమైన సువాసన మీరువవిచూచెదరు తరువాత మీ పళ్లు ఎంత తెల్లగానున్నవో చూడండి. దీనివల్ల మీ పళ్లు పూర్తిగా శుభ్రపడినవన్న సంగతి తెలుపుడి అవుతుంది.

మీ పళ్లు మీద ఏర్పడు జారుపొరలో "ఫైపొయిడ్స్" అను పదార్థము ఉంటుంది. ఈ 'ఫైపొయిడ్స్' ఎప్పటికప్పుడు తీసివేయక పోయిన, దీనిలోని ఆమ్లములు పళ్ల మీద ఉండే ఎనామిల్‌ను తినివేసి క్షీణదశ మొదలుపెట్టించును. "ఫైపొయిడ్స్ను" తప్పక తొలగించివేయాలి. మెక్లీన్సులో ఉండే ప్రత్యేక "ఫైపొయిడ్-సాల్వెంటు" 'ఫైపొయిడ్స్'ను విహానువిశ్చితముగాను... సురక్షితముగాను... శీఘ్రముగాను తొలగించును. అదే పళ్లక్షీణతను అరికట్టుటకు అత్యంత ప్రధానమైనది.

మెక్లీన్సు పేరాక్సైడు టూత్‌పేస్టునే ప్రతి దినము ఉదయము, రాత్రివాడి శుభ్రమైన ఆరోగ్యవంతమైన తెల్లని పళ్లను కలిగి యుండండి.




మెక్లీన్సు పళ్లను అతిశుభ్రముగా పరిశుభ్రపరుచును.

MTY 43 TEL

# ★ నమ్మకస్తుడు ★

కూర్చున్నాడు. చంద్రం సిగరెట్టు నోట్లో పెట్టి అగ్గిపుల్ల వెలిగించాడు. అసిరిగాడికి ఆరిపోయిన చుట్టముక్క గుర్తొచ్చింది. వెంటనే చెవులోనుంచి దాన్ని తీసి అగ్గిపెట్టె అందుకుని ముట్టిస్తూ "అక్కడ తమకు పనేటి దొరా!" అన్నాడు అసిరి. "పెట్రోల్ రా" అన్నాడు చంద్రం. "అంటే!" అసిరిగాడి ముఖం ముడతలు పడింది. "నీముఖం" అన్నాడు చంద్రం, వినిపించకుండా. "యేంటోలే" అంటూ గొణుక్కున్నాడు అసిరిగాడు.

అసిరిగాడి మనస్సు మనస్సులో లేదు. నోరు ఎండిపోతోంది వాడికి-రోజూ ఆవేళకు కడుపులో సారా దండిగా పడేది-అలవాటుపడిన ప్రాణం కనుక దిగజారిపోతున్నాడు. చరచరా కడిందిగి "అలా సూసొత్తాను బాబూ" అన్నాడు. ఉలిక్కిపడి 'ఎక్కడికిరా' అన్నాడు చంద్రం. "ఈడకే—దిబ్బకాడ దొంగనాయాళ్ళు జేరతారు దొరా! వాళ్లను అదిలించొత్తాను" అన్నాడు. చంద్రం వణికిపోతున్నాడు. "దొంగలెక్కువేరా, ఇక్కడ?" అన్నాడు. "దొంగలేటండీ, యెదవగాడిద కొడుకులు, మనోళ్లే! తాగి తిరుగుతూ చేత్తుంటారు. యెన్నెగా కలగరోరి కుప్పదోని కాపలావోళ్లను కూడిందీ!" అన్నాడు అసిరిగాడు. "నిజమేనంటరా?" వణికిపోతూ అడిగాడు చంద్రం. "అలా పిరికడిపోతావేం దొరా! అలాటోడివి కొంపకు పోక యెందు కిక్కడా?" కస్సుమన్నాడు, వాడు. చంద్రం తెల్లముఖం వేశాడు. పైకి మాత్రం, "ఛా! నాకేంభయంరా. నీవు పోయిరా. నా దగ్గర సామగ్రి లేదనా? గురి పెట్టానంటే... గుండుకు నలుగురు 'హరీ' అనాల్సిందే. ఎక్కడికొచ్చినా దాన్నిమాత్రం మరవను" అన్నాడు. "ఆ! అలాగుండాలి మరి మనిసంటే. ఇప్పుడే వత్తాను." అంటూ కూనిరాగంతో అసిరిగాడు వెళ్ళిపోయాడు.

చంద్రం పైకి అన్నాడేగాని, భయంతో నలిగిపోతున్నాడు. అంతా చీకటిమయం. ప్రకృతి కీచురాళ్లశ్రుతిలో నిద్రిస్తోంది. దూరంగా డొంకమీద తాడిచెట్లు నల్లనై మరింత చీకటిని మ్రింగుతున్నాయ్. చంద్రం వాటి వంక చూడలేక పోతున్నాడు. అతనికి చచ్చే భయం మరి.

దిబ్బకి అవల డొంకలో కాపుసారా కాస్తారు. రాత్రిళ్లు కొంతభాగాన్ని దగ్గరలోని పల్లెలకు తరలిస్తారు; మరికొంత సారాని దిబ్బ మరుగులో దాస్తారు. అసిరిగాడు అక్కడికే వెళ్లాడు—వాడిని చూసి కొందరు చాటుగా తప్పుకున్నారు.

చంద్రానికి దెయ్యం అంటే చచ్చేభయం. చిన్ననాటి నాయనమ్మకథలు గుర్తొస్తున్నాయ్. దిబ్బవైపు ఆశగా చూశాడు. అటునుంచి కొన్ని ఆకారాలు తనవైపు వస్తున్నాయ్. ఉలిక్కిపడి చంద్రం గడ్డిలో ఇరుక్కుపోయాడు. చివరకు మిణుకు మిణుకుమనే నక్షత్రంలో ప్రాణం పెట్టుకు ఉన్నాడు. నిశ్శబ్దం భగ్నమైంది. క్రిందికి చూశాడు. మానవాకారాలు! గుంపులుగా వచ్చి - చీలినయ్. కడిమిని చుట్టుముట్టినయ్. అతనిప్రాణం ఒక్కసారి ఎగిరిపోతుందేమో ననిపించింది. కళ్ళు మూసుకున్నాడు. శ్వాసకూడా పీల్చుకోటంలేదు. పక్కన పేనల్లే గడ్డిలో అతుక్కుపోయాడు.

ధాన్యం రాసిమీద గడ్డితీస్తున్న చప్పుడైంది. "అసిరిగా" అని కేకకూడా వేయలేక పోతున్నాడు. అంతలోనే అసిరిగాడు తూలుతూ నిషాలో కర్రతో చప్పుడు చేసుకుంటూ వస్తున్నాడు. 'అయ్యగోరూ' అని కేకవేశాడు. చంద్రం నోరు మెదపలేదు. అప్పుడే, అసిరిగాడి తలమీద బలంగా మ్రోతమోగిన చప్పుడైంది. చంద్రం మరీ లోనికి దూరిపోతున్నాడు. అసిరి నేల కొరిగి తన్నుకుంటున్నాడు. దొంగలు వస్తుమూటలు కట్టున్నారు. అసిరిగాడు నుంచోటానికి సర్వప్రయత్నం చేస్తున్నాడు; చివరికి ఒక్కసారిగా ఊపిరిపీల్చుకుని లేచి-ఎదురుగా వచ్చేవాడిని కర్రతో శక్తికిమించి విసిరాడు. "అబ్బా!" అని వాడు నెత్తురు కక్కుకుంటూ వెనక్కు దౌడు తీశాడు. దొంగ కేకస్వరం గ్రహించి, "ఓరి మితాయి రామయ్యో!... నువ్వంటయ్యో" అని అసిరిగాడు వెంబడించాడు. చంద్రం గతుక్కుమన్నాడు. ఎక్కడి దొంగలు అక్కడ పారిపోయారు.

చంద్రం కడిమిలోంచి గడ్డి తప్పించుకుని కళ్లంలోకి ఉరికాడు. అసిరిగాడు తలమీద నుంచి కారేరక్తాన్ని చేతుల్తో ఆపుకుంటూ వెనక్కుదిరిగాడు. చంద్రం వణికిపోతూ అసిరినొచ్చి కావిలించుకున్నాడు. విదిలించి "ఊరొక్కవయ్యా, మొగాడివి" అంటూ కసురుకున్నాడు అసిరిగాడు. ★










నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము, నిస్త్రాణ, నిస్సత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బీ రు 3-4-0. పోస్టేజి రు. 1-0-0.

పి. సి. ఏ. అండ్ కో., (ఆయుర్వేద సమాజం)
పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా.